www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 26 ఏప్రిల్ 2023
4
తిరుపతి



ప్రసంగిస్తున్న కందారపు మురళి

విద్యార్థులకు భారం 'ఈ-కంటెంట్..'



ప్రజాశక్తి - బాలాయపల్లి

ప్రాథమిక విద్యా రంగంలో వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టామని చెబుతున్న ప్రభుత్వం నేడు విద్యా వ్యవస్థను డిజిటల్‌మయం చేసింది. ఇప్పటికే టీచర్లు పాఠాలు చెబుతూ విద్యార్థులను తీర్చిదిద్దుతుండగా అది చాలదన్నట్లు డిజిటల్ విద్యను ప్రవేశపెడుతున్నారు. డిజిటల్ విద్యతో విద్యార్థులకు పరిచయం అవసరమే కానీ అది ప్రాథమిక స్థాయిలో అది వారిపై మోయలేని భారంగా మారకూడదు. అయితే ప్రభుత్వ 'ఈ-కంటెంట్' విద్య విద్యార్థులకు భారంగా మారనుంది. ఇప్పటికే విద్యార్థులకు బైజూస్ యాప్ పాఠాలను అందుబాటులోకి తెచ్చారు. ఇది చాలదన్నట్లు కొత్తగా రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి విద్యార్థులకు ఈ-కంటెంట్లు అందించేందుకు ఈ పాఠశాల అనే యాప్ ని రూపొందిస్తోంది.

బైజూస్ సంగతేంటి..?

ఇప్పటికే రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో 4 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బైజూస్ ద్వారా ఈ-కంటెంట్ ను అందిస్తున్నారు. అయితే కేవలం నాన్ లాంగ్వేజ్ సబ్జెక్ట్‌ల లో మాత్రమే అందిస్తున్నారు. ఒకవైపు విద్యార్థులు టీచర్లు చెప్పే పాఠాలు వింటూనే, వారిచ్చే హోం వర్క్ లు చేస్తూనే మళ్లీ బైజూస్లోనూ పాఠాలు విని అక్కడి ఎక్సర్సైజులు చేయాల్సి వస్తోంది. ఇప్పటికే ఇది విద్యార్థులకు భారంగా ఉంది. కొత్తగా ఎస్.సి.ఇ.ఆర్.టి రూపొందించిన ఈ కంటెంట్ ను విద్యార్థులు, చదవాల్సి రావడం అంటే అది ఇంకా భారంగా మారనుంది. ఎస్‌ఇఆర్ లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ రెండింటి ఈ కంటెంట్ తయారు చేస్తోంది. ఇప్పటికే ప్రైవేటుకు చెందిన నాన్ లాంగ్వేజ్ కంటెంట్లు విద్యార్థులు ఫాలో అవుతున్నారు. ఇప్పుడు వచ్చే ఏడాది ఈ రెండింట్లో ఏ కంటెంట్ ను ఫాలో అవ్వాలనేది పెద్ద కన్ఫ్యూజన్. అసలు ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు ఇంత పెద్ద ఎత్తున డిజిటల్ విద్య అవసరం లేదని విద్యా రంగ నిపుణులు. అంటున్నారు. కొంత డిజిటల్ విద్యను పరిచయం చేసి టీచర్ల ద్వారానే బాగా పాఠాలు చెప్పిస్తే సరిపోతుందని వీరు చెప్తున్నారు. టీచర్ను మించి ఏ డిజిటల్ విద్య విద్యార్థికి అర్థమయ్యేలా చెప్పలేదనేది నిరూపించబడిన సత్యం.

అర్థం కాక తల పట్టుకుంటున్నారు

ఇప్పటికే బైజూస్ లో వస్తున్న పాఠాలను విద్యార్థులు చూసి అర్థం కాక తల పట్టుకొని అలాగే నిమగ్నమై ఆన్లైన్ యాప్ లో చూస్తూనే ఉండి పోతున్నారు. ప్రత్యక్షంగా ఈ ఉపాధ్యాయులు దగ్గరుండి విద్య బోధన చేస్తే ఎంతటి కష్టమైన పదాలు వాక్యాలు పిల్లలకి అర్థమయ్యేలా ఉంటాయి. విద్యార్థికి అర్థం కాకపోతే ఆ ఉపాధ్యాయుడు తిరిగి మరలా చెప్పి వివరించగలుగుతారు. అదే బైజూస్ ఈ కంటెంట్ లలో విద్యాబోధన చేస్తే ఎవర్ని ప్రశ్నించాలి ఆ ప్రశ్నలకు జవాబులు ఎవరు చెప్తారు వారు చెప్పిన జవాబులు పిల్లలకి అర్థం అవుతాయి అనే సందిగ్ధంలో విద్యార్థులు తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుపై ఆలోచనలో పడుతున్నారు.

ఈ - పాఠశాలలో ఏముంటాయంటే...

ఎస్ సి ఇ ఆర్టీ ఈ-పాఠశాల యాప్‌ని తయారు చేస్తోంది. 2023-24 విద్యాసంవత్సరాని కల్లా ఇది రెడీ అవుతుంది. ఈ యాప్లో నాలుగో తరగతి నుండి తొమ్మిదో తరగతి వరకు పాఠాలు డిజిటల్ రూపంలో ఉంటాయి. అంతేకాకుండా ప్రశ్నలు, జవాబులు, ఎక్సర్ సైజు దీంట్లో ఉంటాయి. లాంగ్వేజెస్, నాన్ లాంగ్వేజెస్ రెండు రకాల సబ్జెక్టు లోనూ ఈ కంటెంట్ అందుబాటులో ఉంటుంది. ఈ-కంటెంట్‌ను ఆంధ్రప్రదేశ్ ఈ పాఠశాల, యూ ట్యూబ్, దీక్షా ప్లాట్ ఫామ్, పీఎం ఈ-విద్యలో అందుబాటులో ఉంచుతారు.

సులభ కార్మికులపై 'ఎస్మా' సిగ్గుచేటు: సిఐటియు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

భక్తుల మలమూత్రాలను శుద్ధి చేసే అత్యంత పేదలు, దళితులు, అమాయకులైన సులభ్ కార్మికులపై ఎస్మా ప్రయోగిస్తామని టీటీడీ యాజమాన్యం ప్రకటన చేయడం దారుణమని ఇంతకంటే సిగ్గుచేటు మరొకటి ఉంటుందా? అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తీవ్రంగా విమర్శించారు. సులభ్ కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా మంగళవారం మధ్యాహ్నం హరే రామ హరే కష్ణ గ్రౌండ్లో కందారపు మురళి కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. గత ఏడాది ఎఫ్ఎంఎస్ కార్మికులు వేలాదిమంది 14 రోజులపాటు నిరవధిక నిరసన తెలియజేస్తే పట్టించుకోని టీటీడీ యాజమాన్యం సులభ్ కార్మికులు ముందస్తు సమాచారం లేకుండా పోరాటానికి వచ్చారని విమర్శించడం భావ్యమా? అని ప్రశ్నించారు. ఎఫ్ఎంఎస్ కార్మికుల పోరాటం సందర్భంగా నియమించిన అధికారుల కమిటీ ఇప్పటివరకు ఏం చేసిందో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల కన్నీళ్లను పట్టించుకోకుండా వారి పట్ల అమానుషంగా, వివక్షతో వ్యవహరించడం టిటిడి యాజమాన్యానికి అలవాటైపోయిందని తీవ్రంగా విమర్శించారు. శాశ్వత ఉద్యోగులకు లడ్డూ, వడ బ్రహ్మోత్సవ బహుమానంగా ఇచ్చి మలమూత్రాలు శుద్ధి చేసే పారిశుధ్య కార్మికులకు లడ్డూ వడను నిరాకరించటం ఏ పాటి న్యాయమో? ధర్మారెడ్డి సమాధానం చెప్పాలని అన్నారు. సులభ్ కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ లేదని వారి పట్ల కాంట్రాక్టర్ అమానుషంగా ప్రవర్తిస్తున్నాడని, సూపర్వైజర్లు ఇబ్బందులు పెడుతున్నారని తక్షణం సులబ్ కాంట్రాక్టును రద్దుచేసి... ఎఫ్ఎంఎస్, సులభ్ కార్మికులందరినీ లక్ష్మీ శ్రీనివాసా కార్పొరేషన్ లో కలిపి తమ నిజాయితీని అధికారులు చాటుకోవాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, టి. సుబ్రమణ్యం, ఆర్. లక్ష్మి, నాగవెంకటేష్, జయంతి, తంజావూరు మురళి, రఘు, మునిరాజ, వేణుగోపాల్, చిన్నా, బుజ్జి, పార్ధసారథి, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

సులభ కాంట్రాక్ట్ కార్మికులకు జనసేన మద్దతు

తిరుమల తిరుపతి దేవస్థానం సులభ్ కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళనకు మద్దతుగా జనసేన పార్టీ తరపున చిత్తూరు జిల్లా అధ్యక్షులు డా.పసుపులేటి హరి ప్రసాద్ మద్దతు ప్రకటించారు. జీతాలు పెంచి, బోనస్సులు ఇవ్వాలని. పర్మినెంట్ చేసి వాళ్ళకి సరైన గుర్తింపు ఇవ్వాలన్నారు. వాళ్ళు మనుషులేనని అంటరాని వాళ్ళలా చూడకూడదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ యాదవ్, జిల్లా కార్యదర్శులు ఆనంద్, బాటసారి, తిరుపతి నగర అధ్యక్షుడు రాజారెడ్డి, నగర ఉపాధ్యక్షుడు పార్థు, నగర కార్యదర్శి స్వీట్ షాప్ సుమన్ ,లోకేష్ పాల్గొన్నారు.

అక్షయక్షేత్రాల స్థితిగతులు పరిశీలన : జేఈవో

క్యాంపస్: అక్షయకేంద్రానికి కరోనాకు ముందు టిటిడి ఏడాదికి 15 లక్షల మేరకు ఆర్థిక సాయం చేసేదని, కోవిడ్ ప్రబలినప్పటి నుంచి ఈ సాయాన్ని నిలిపేశామని టిటిడి జేఈవో సదా భార్గవి తెలిపారు. మంగళవారం రామచంద్రాపురం మండలంలోని దుర్గసముద్రం, రేణిగుంటలోని అక్షయక్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ అక్షయక్షేత్రాల స్థితిగతులను పరిశీలించి నివేదికను ఈవోకు సమర్పిస్తామని, ఆర్థిక సాయం పునరుద్ధరణకు సంబంధించి ఈవో నిర్ణయం తీసుకుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో డిఈవో భాస్కర రెడ్డి, పిఆర్వో డాక్టర్ రవి, బాల మందిరం ఎఈవో అమ్ములు పాల్గొన్నారు.

డీన్ ఎగ్జామినేషన్స్‌గా ఆచార్య కిషోర్

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని జువాలజీ విభాగం అధ్యక్షులుగా పనిచేస్తున్నటువంటి ఆచార్య ఎస్. కిషోర్ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులను ఆచార్య కిషోర్ మంగళవారం ఉపకులపతి ఛాంబర్ లో అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం పరీక్షల తేదీలను ముందుగానే ప్రకటించి, పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించి, పరీక్షా ఫలితాలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు ఉపయోగపడేలా చూస్తానని అన్నారు. ఉన్నతాధికారులు తనపై నమ్మకం ఉంచి ఇచ్చిన ఈ పదవికి పూర్తిస్థాయిలో అందరి సహాయ, సహకారాలతో న్యాయం చేస్తానన్నారు.

ఏపీఆర్జేసిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో 2023-24వ సంవత్సరానికి గానూ ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రవేశ పరీక్ష మే 20న ఉంటుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్ రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లతో పాటు వత్తి విద్యా కోర్సులైన ఈఈటి, సీజీటీ గ్రూపుల్లో సీటు పొందవచ్చన్నారు. గత ఏడాది 2022 ఏ.పీ.ఆర్.జే.సి. ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకును తమ విద్యార్థిని సొంతం చేసుకున్నారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9399976999 / 8688888802 ఫోన్ నంబర్లను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

కేసు స్టడీకి అనువైనది శ్రీసిటీ : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

వరదయ్యపాలెం : ప్రపంచవ్యాప్తంగా అధ్యయనానికి అత్యంత ఆదర్శమైన పారిశ్రామికవాడ శ్రీసిటీ అంటూ కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివద్ధి శాఖామాత్యులు జి.కిషన్ రెడ్డి ప్రశంసించారు. మంగళవారం ఉదయం శ్రీసిటీ పర్యటనకు విచ్చేసిన ఆయనకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక బిజినెస్ సెంటర్ లో శ్రీసిటీ పరిశ్రమల సీఈఓ ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పెట్టుబడుల అనుకూల వాతావరణంతో కూడిన ప్రణాళికాబద్ధమైన పారిశ్రామిక కేంద్రం శ్రీసిటీ ప్రగతి తనను ఆశ్చర్యానికి గురిచేస్తోందని అన్నారు. భారీ ఉద్యోగాల కల్పనకు శ్రీసిటీ చేస్తున్న కషిని అభినందించిన కిషన్ రెడ్డి, మెట్రో కోచ్‌లు, ఆటోమొబైల్స్, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, ఎఫ్ఎంసిజి, ఫుడ్ ప్రాసెసింగ్, ఎయిర్ కండిషనర్లు, ఎలక్ట్రానిక్స్, ఫార్ములేషన్స్ తదితర వివిధ రంగాల తయారీ పరిశ్రమలకు శ్రీసిటీ నిలయంగా మారిందని ప్రశంసించారు. పలు ప్రత్యేక లక్షణాలు కలిగిన శ్రీసిటీ, ఖచ్చితంగా ప్రపంచ స్థాయిలో ఒక మంచి 'కేస్ స్టడీ' అవుతుందన్నారు. ఈ నమూనాను ఇప్పటికే దేశంలోని ఇతర పలు ప్రాంతాలలో అనుసరిస్తున్నట్లు చెప్పారు. పర్యటనలో భాగంగా కిషన్ రెడ్డి శ్రీసిటీ పరిసరాలు వీక్షించడంతో పాటు బ్లూస్టార్ పరిశ్రమను సందర్శించారు. పరిశ్రమ ఉత్పత్తులు పరిశీలించి, అక్కడ ఉద్యోగులతో కొద్దిసేపు ముచ్చటించారు.

ఇంటిగ్రేటెడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పరిశీలన

తిరుపతి టౌన్ : మునిసిపల్ కార్పొరేషన్ నిర్వహణలో తూకివాకం వద్ద ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ మంగళవారం పరిశీలించారు. నగరంలో ఉత్పత్తి అవుతున్న తడి పొడి చెత్త, భవణ నిర్మాణ వ్యర్థాలు, మురుగు నీరును ఈ ప్లాంట్ ద్వారా రీ సైక్లింగ్ చేయడం వలన మన కార్పొరేషన్ కు జాతీయ స్థాయిలో మంచి పేరుందని, ఇటీవల ఇక్కడి నిర్వహణ సరిగా లేకపోవడాన్ని ప్రస్థావిస్తూ, ఇకపై అనుకున్న మేర ఈ ప్లాంట్ ద్వారా లక్ష్యాలను సాధించాలన్నారు. తడి చెత్త నుండి సేంద్రీయ ఎరువులు గతంలో రోజుకి 10 టన్నులు ఉత్పత్తి అవుతుంటె నేడు నిర్వహణ లోపించి పూర్తిగా ఎరువులు తయారు చేయకుండా వుండడాన్ని గుర్తించి నిర్వాహకులకు గట్టిగా ఆదేశాలు జారీ చేస్తూ ప్రతిరోజు 70 టన్నుల తడి చెత్తను ఎరువుగా మార్చాల్సిందేనన్నారు. పొడి చెత్త ప్లాంట్ ను పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నగరం నుండి వస్తున్న పొడి చెత్తను విభాగాలుగా విభజించి రీ సైక్లింగ్ చేయాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఇటుకలు, టైల్స్ గా మార్చే ప్రకియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. మహేంద్ర బయో గ్యాస్ ప్లాంట్ ను పరిశీలిస్తూ నగరంలోని హొటల్స్ నుండి వ్యర్థంగా పడవేస్తున్న ఆహార పదార్థాలను అధిక మొత్తంలో సేకరించి గ్యాస్ ఉత్పత్తిని పెంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాంట్లలో ఫైర్ సేఫ్టి వుండాలని, వర్కర్లకు తగిన జాకెట్లు, గ్లౌజులు ఇవ్వాలని సూచనలు జారీ చేసారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈ విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంపై హెలికాప్టర్ల విహారం

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయం గగనతలంలో నో ఫ్లై జోన్ నిషేధాజ్ఞలు ఉండడం తెలిసిందే. ఆగమ శాస్త్ర నియమావళి ప్రకారం శ్రీవారి ఆలయంపై విమానాలు, హెలికాప్టర్లు ఎగరడం నిషిద్ధం. అయితే మంగళవారం మధ్యాహ్నం ఏకంగా మూడు హెలికాప్టర్లు తిరుమల కొండ మీదుగా వెళ్లాయి. స్వామివారి ఆలయం సమీపం నుంచే ఇవి వెళ్లడంతో తీవ్ర కలకలం రేగింది. తిరుమల గగనతలంలో హెలికాప్టర్లు ప్రయాణించడంపై టీడీడీ అప్రమత్తమైంది. ఆ హెలికాప్టర్లు ఎక్కడివన్నదానిపై టీటీడీ విజిలెన్స్ అధికారులు సమాచారం సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. కాగా, ఈ హెలికాప్టర్లు భారత వాయుసేనకు చెందినవని, కడప నుంచి చెన్నై వెళుతున్నాయని తెలిసింది. గతంలో తిరుమల కొండపై తీవ్ర కార్చిచ్చు చెలరేగగా, ఆ మంటలను ఆర్పేందుకు మాత్రమే భారత వాయుసేన హెలికాప్టర్లను ఉపయోగించారు.

శ్రీవారిని దర్శించుకున్న అనాథలు, ప్రత్యేక ప్రతిభావంతులు

ప్రజాశక్తి -తిరుమల

శ్రీవారి దర్శనంతో వందలాది మంది అనాథలు, అంధులు, దివ్యాంగులు పులకించిపోయారు. చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షులు శేఖర్ రెడ్డి చొరవతో రాజస్థాన్ యూత్ అసోసియేషన్, చెన్నై ఫుడ్ బ్యాంకు ఆధ్వర్యంలో 1008 మంది అనాథలు, అంధులు, దివ్యాంగులు మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, విజివో బాలిరెడ్డి కలిసి వద్ధులు, దివ్యాంగుల క్యూలైన్ ద్వారా వీరికి దర్శన ఏర్పాట్లు చేశారు. తమ మనోనేత్రంతో స్వామివారిని దర్శించుకున్నామని పలువురు అంధులు సంతోషం వ్యక్తం చేశారు. దర్శనానంతరం తరిగొండ వెంగమాంబ కాంప్లెక్స్ లో అన్నప్రసాదాలు స్వీకరించారు.

బాలల హక్కులను కాపాడాలి

క్యాంపస్ : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలలు వీధుల వెంబడి తిండి కొరకు అడుక్కునే పరిస్థితి లేకుండా వారు బాల్యాన్ని స్వేచ్ఛగా అనుభవించే విధంగా వాతావరణం కల్పించుటకు, బాలల హక్కులను కాపాడడం కొరకు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఎల్లవేళలా ముందుంటుందని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ ఆర్జి. ఆనంద్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక అలిపిరి పోలీస్ స్టేషన్ సమీపంలోని అంగన్వాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ బాలల హక్కుల కమిషన్ సభ్యులు మాట్లాడుతూ భారత దేశంలో ముఖ్యంగా 51 నోడల్ ప్రాంతాలలో ప్రత్యేకించి పుణ్యక్షేత్రాలు గల ప్రాంతాల లో చిన్నపిల్లలు అడుక్కోవడం, బాల కార్మిక వ్యవస్థ ఉన్నట్లు ఎన్సిపిసిఆర్ సర్వే లో గుర్తించడం జరిగిందని, అందులో భాగంగా సంబంధిత పుణ్యక్షేత్రాల అధికారులతో, జిల్లా యంత్రాంగంతో సదరు అంశాలపై సమీక్ష చేసి, దిశా నిర్దేశం చేయబడుతుందని అన్నారు. అందులో భాగంగా మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుమల లో మహిళా శిశు సంక్షేమ శాఖ, టీటీడీ అధికారులతో ఈ అంశాలపై సమీక్షించి తనిఖీ చేసామని, వారు స్క్వాడ్ ఏర్పాటు చేసుకొని తిరుమలలో ఉన్న ప్రాంతాలలో తరచూ తనిఖీలు చేపట్టి బాల కార్మిక వ్యవస్థ లేకుండా, చిన్నారులు అడుక్కునే పరిస్థితులు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లో చేపట్టారని ఇది మంచి విధానమని కితాబిచ్చారు. జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధికారి శివ శంకర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య, సిడిపీఓ సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

నాకు సంబంధం లేదు రిటైర్డ్ తహశీల్దార్

తిరుపతి టౌన్ : రేణిగుంట తాసిల్దారు పరిధిలో ఇప్పుడు ఇస్తున్న ఎంజాయ్ మెంట్ పట్టాలకూ తనకు సంబంధం లేదని తాను రిటైర్డ్ అయ్యి నాలుగు సంవత్సరాల నాలుగు నెలలు అవుతుందని, ఎంజాయ్మెంట్ పట్టాల్లో తన సంతకం ఫోర్జరీ చేసి ఇస్తున్నారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రేణిగుంట రిటైర్డ్ తాసిల్దార్ ఎం నరసింహ నాయుడు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. రేణిగుంట తహసీల్దార్ గా పనిచేసినప్పుడు అప్పటి ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఎక్కువగా తారకరామ నగర్ లో అర్హులైన నివాసం ఉన్న వారికి, మరికొన్ని గ్రామాల్లో ఎలక్ట్రిసిటీ కనెక్షన్ కొరకు సర్టిఫికెట్లు ఎలాంటి విమర్శలు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇంటి పట్టా రిజిస్టర్ లో నమోదు చేసి ఇవ్వడం జరిగిందని, కానీ ప్రస్తుతం తన పేరిట, అలాగే ఇతర తహసీల్దార్ ల పేరిట కొందరు సంతకాలు ఫోర్జరీ చేసిఅక్రమంగా దళారులతో అమాయక ప్రజలను మోసగిస్తున్నట్లు తెలిసినందున ప్రజలు అప్రమత్తం గా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాను. తాను గత నాలుగుసంవత్సరాలుగా బెంగుళూరు లో పిల్లల వద్ద ఉన్నానని, రిటైర్ అయిన తర్వాత ఎలాంటి సంతకాలు చెయ్యలేదని పేర్కొన్నారు.

5 శాతం రాయితీకి ఇంకా 5 రోజులే : కమిషనర్ హరిత

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈ ఆర్థిక సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థల పన్నుల చెల్లింపుపై 5 శాతం రాయితీకి ఇక 5 రోజులే సమయం వుందని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించడం వల్ల నగరాభివద్ధికి దోహదపడుతుందని, పాత బకాయిలు వున్న పన్నులపై వడ్డీని మాఫి చేసిన ప్రభుత్వం నేడు ఈ ఆర్థిక సంవత్సరానికి ఈ నెలఖారు లోపు ఏక మొత్తంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లింపులపై 5 శాతం రాయితీని ప్రకటించందని, ఈ అవకాశాన్ని తిరుపతి ప్రజలు సద్వినియోగం చేసుకొని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యలయంలో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు తమ పన్నులను చెల్లించవచ్చని కమిషనర్ హరిత ఐఏఎస్ తెలిపారు.

ఉద్యోగ జేఏసీ ఆందోళనకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఉద్యోగులకు 12వ పిఆర్సిని తక్షణం నియమించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి డిమాండ్ చేశారు. అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలపై మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, కార్మికులతో ధర్నా జరిగింది. ఈ ధర్నాకు హాజరైన కందారపు మురళి ఉద్యోగుల పోరాటానికి మద్దతు తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను మర్చిపోయి ఉద్యోగులపై నిర్బంధానికి పాల్పడటం దారుణమని విమర్శించారు. ఎన్నికలకు ముందు తాను అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులరైజ్ చేస్తానని చెప్పారని, ఈరోజు వరకూ ఆ ఊసే లేదని విమర్శించారు. ఉద్యోగులతో స్నేహపూర్వక ప్రభుత్వంగా ఉంటుందని చెప్పి, అధికారంలోకి వచ్చింది మొదలు నేటి దాకా నిర్బంధానికి గురి చేయడం ఏ రకంగా న్యాయమా అని ప్రశ్నించారు. బటన్ నొక్కడం ద్వారానే తాను తిరిగి అధికారంలోకి వస్తానన్న భ్రమలో ముఖ్యమంత్రి ఉన్నారని, ఉద్యోగుల సహకారం లేకుండా ఈ ప్రభుత్వం ఎంతో కాలం మనుగడ సాగించలేదని అన్నారు. ఉద్యోగులు, కార్మికులు, కార్మిక సంఘాలపై నిర్బంధానికి పాల్పడుతున్న పోలీసులకు సైతం రెండు లక్షల రూపాయల బకాయి ఈ ప్రభుత్వం ఉన్నదని గుర్తు చేశారు. ప్రభుత్వం తన వ్యవహార శైలిని తక్షణం మార్చుకోవాలని, ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ ను రద్దు చేయాలని, 11వ పిఆర్సి బకాయిలను తక్షణం చెల్లించాలని, ఉద్యోగులు పెట్టిన 13 రకాల డిమాండ్ల సాధన కోసం వారు సాగిస్తున్న పోరాటానికి సంపూర్ణమైన మద్దతును సిఐటియు తెలియజేస్తున్నదని ఆ ప్రకటనలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకష్ణ, పెంచలయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ జేఏసీ చైర్మన్ జి. నాగ వెంకటేష్, అమరావతి జేఏసీ చైర్మన్ గోపీనాథ్ రెడ్డి, రూప్ చంద్, శివప్రసాద్, ఓ. వెంకటరమణ, సెల్వరాజ్ తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో కార్మికులు ఉద్యోగులు పాల్గొన్నారు .

వజ్రమ్మను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఓజిలి

మధ్యాహ్న భోజన కార్మికురాలిని వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే పోరాటం ఉదతం చేస్తామని సిఐటియూ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట మండుటెండలో సిఐటియూ ఆధ్వర్యంలో మధ్యన భోజన కార్మికులు , విద్యార్థుల తల్లిదండ్రులు నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా కార్యదర్శి ఎస్.ముకుంద , మధ్యాహ్న భోజన పథకం జిల్లా కార్యదర్శి విజయమ్మ , ఐద్వా కన్వీనర్ చంద్రకళ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం పథకం ద్వారా పున్నేపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలలో 23 ఏళ్లుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాలు వజ్రమ్మ పై కక్ష సాధింపు చర్యలతో తొలగించడం అన్యాయమన్నారు. మండల విద్యాశాఖ అధికారిణి సూచనల మేరకు వజ్రమ్మతో తెల్ల పేపర్ మీద సంతకాలు చేయించుకుని వజ్రమ్మ రాజీనామా చేసినట్లు చిత్రీకరించి అకారణంగా తొలగించారని పేర్కొన్నారు. వజ్రమ్మకు మద్దతు తెలుపుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తొలగిస్తానంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలియజేశారు. మధ్యాహ్న భోజన కార్మికురాలు వజ్రమ్మను విధుల్లోకి తీసుకోకపోతే ప్రతిరోజూ మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

అటానమస్ దిశగా ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాల : టీటీడీ జేఈవో

ప్రజాశక్తి - క్యాంపస్

మొదటి ప్రయత్నంలోనే న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ సాధించిన శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల అటానమస్ దిశగా అడుగులు వేయాలని టీటీడీ జేఈవో సదా భార్గవి కోరారు. తిరుపతిలోని ఎస్జీఎస్ కళాశాలకు న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ వచ్చిన సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జేఈవో మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలోని అన్ని డిగ్రీ కళాశాలలకు న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ లభించడం సంతోషకరమన్నారు. ఇందుకు కృషి చేసిన డిఈవో , కళాశాల అధ్యాపకులు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. కళాశాలలో ఆలయ శిల్పకళ, ఆలయ సాంప్రదాయం ఉట్టిపడేలా ఆర్ట్ గ్యాలరీ ప్రారంభించినట్టు తెలిపారు. వాకర్స్ అసోసియేషన్, పెన్షనర్స్ అసోసియేషన్ పాల్గొని అధ్యాపకులను అభినందించడం సంతోష కరమన్నారు. పూర్వ విద్యార్థులైన డెప్యూటీ ఈవో గోవిందరాజన్, పిఆర్వో డా. టి.రవి కలిసి కళాశాల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డిఈవో డా. ఎం.భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీ' కార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశం : కలెక్టర్

తిరుపతి టౌన్ : పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్యశ్రీ కార్డుల్లో మార్పులు చేర్పులకు సచివాలయాలను సందర్శించాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నిర్ణీత ధృవపత్రాలతో సందర్శించి, నిర్దేశిత రుసుము చెల్లించి మార్పులు చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను పొందాలని సూచించారు. కార్డులో కుటుంబ యజమాని ఫొటో మాత్రమే ముద్రించి ఉంటే, వాటి స్థానంలో ఇపుడు కుటుంబసభ్యుల అందరి ఫొటోను పొందుపరవచ్చని తెలిపారు

ఉత్తమ బోధనే లక్ష్యంగా సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విద్యా బోధనే లక్ష్యంగా పాఠశాల సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ భువనేశ్వరి అన్నారు. పట్టణంలోని ఆర్ పి బి ఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల సామాజిక తనిఖీలపై ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మెరుగైన విద్య, వివక్షత లేని పాఠశాల వాతావరణం, సామాజిక రుగ్మతల నివారణ, బాల్యవివాహాల నిర్మూలన, ఆడపిల్లల భద్రత, జవాబుదారీతనం, తల్లిదండ్రుల అభిప్రాయాల సేకరణ, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు తదితర అంశాలే లక్ష్యంగా సామాజిక తనిఖీలు నిర్వహించాలన్నారు. అభిప్రాయాల ఆధారంగా సామాజిక తనిఖీ కోసం నిర్దేశించిన యాప్ లో వివరాలను పొందుపరచాల్సిందిగా ఆమె సూచించారు. యాప్ నిర్వహణపై రిసోర్స్ పర్సన్ కస్తూరయ్య ప్రధానోపాధ్యాయులకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, చంద్రశేఖర్, గోపి, లక్ష్మన్న, పురుషోత్తం రాజు లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల జీవో 110 అమలు చేయండి

అకాడమిక్ కన్సల్టెంట్ అసోసియేషన్ సంఘం నేతల వినతి

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎన్నో సంవత్సరాలుగా ఎంతోమంది ఒప్పంద ప్రాతిపదికన సేవలను అందిస్తున్న అధ్యాపకులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 110 జీవోను అమలు చేయాలని అకాడమిక్ కన్సల్టెంట్ అసోసియేషన్ సంఘం నేతలు మంగళవారం ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు కె.కిషోర్ కుమార్ రెడ్డి, ఐఎస్ కిషోర్‌లు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా వర్సిటీలో వివిధ విభాగాలలో సేవలందిస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యలను ఉపకులపతి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఒప్పంద అధ్యాపకుల డెసిగ్నేషన్ పేరు మార్పును అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్ట్‌గా మార్చాలని, ఇప్పటికీ రాష్ట్రంలోని అనేక విశ్వవిద్యాలయాలతో పాటు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో కూడా డిసిగ్నేషన్ మార్పు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా 89 రోజులకు ఇచ్చే తాత్కాలిక రెన్యువల్ కాల పరిమితిని 11 నెలలకు ఒకేసారి ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఎంతోమంది నిరుపేదలైన అకాడమీ కన్సల్టెంట్లు తమ జీవన భృతిలో భాగంగా తల్లిదండ్రుల ఆరోగ్యం, పిల్లల చదువులు, తిరుపతి నగరంలో ఉన్నటువంటి ప్రస్తుతం ఇంటి బాడుగలు, కరెంటు బిల్లులు, తదితర ఖర్చులు ఎక్కువయ్యాయని వీటిని దృష్టిలో ఉంచుకొని వారి జీతాలను పెంచాలని కోరారు. ఎస్వీయూలో నిర్వహించే వచ్చే పాలకమండలి సమావేశంలో ఒప్పంద అధ్యాపకుల 110 అమలుపై ప్రత్యేకమైన కమిటీని వేసి వీలైనంత తొందరగా అమలు చేసేందుకు కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు ఆనంద్ అమతరాజ్, వెంకటేష్, సుదర్శన్ రెడ్డి,శివకుమార్, ప్రవీణ్ కుమార్, కుమార్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

యుడిఎస్ సమస్యను పరిష్కరించండి: సిపిఎం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి 44వ డివిజన్ యశోద నగర్‌లో నిత్యం పొంగిపొర్లుతున్న భూగర్భ డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు సిపిఎం నాయకురాలు ఆర్ లక్ష్మి ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ యుడిఎస్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిత్యం లీకేజీ కారణంగా రోడ్డుపై ప్రజలు నడవాలంటే అవస్థలు పడుతున్నారని అన్నారు. భూగర్భ డ్రైనేజీ కొత్త పైపులైన్లు వేసి ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. కమిషనర్ స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కె.మోహన్, స్థానికులు ఉన్నారు.

భూమిపూజను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-సత్యవేడు: పట్టణంలో ఈనెల 27వ తేదీన జరగనున్న టిటిడి కళ్యాణ మండపం భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. మంగళవారం సత్యవేడు బేరిశెట్టి కళ్యాణ మండపంలో వైసీపీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టిటిడి కళ్యాణ మండప భూమి పూజ కార్యక్రమం నిర్వహణపై ఆయన పార్టీ శ్రేణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ నిరంజన్ రెడ్డి, వైసీపీ జిల్లా కార్మిక సంఘం అధ్యక్షులు బిరేంద్ర వర్మ, మండల నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, బెల్ట్ రమేష్, పార్థీపన్ హాజరయ్యారు. సమావేశంలో ఎంపిటీసీలు, గ్రామ సర్పంచులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంని దూషిస్తే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌ని ప్రతిపక్ష పార్టీలు దూషిస్తే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం పార్టీ నేతలకు సూచించారు. మంగళవారం టిటిడి కళ్యాణమండపం భూమి పూజ సమావేశంలో సీఎంని సత్యవేడు టిడిపి మాజీ ఎమ్మెల్యే హేమ లత, ఆమె కూతురు హెలెన్ దూషించడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీ 10వ వార్డులో, గోవిందపాలెం దళితవాడ గ్రామంలో తాగడానికి నీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సిపిఐ పుత్తూరు పట్టణ కార్యదర్శి డి మహేష్ తెలిపారు. మంగళవారం గోవిందపాలెం దళితవాడలో సిపిఐ నాయకులు, మహిళలు కలిసి తాగునీరు లేదని ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు ఆరు రోజులుగా మున్సిపాలిటీ వారు అందించలేదని, ఈ వేసవిలో తాగునీరు కొరత లేకుండా చూడాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సెల్వరాజ్ ఆచారి, రవి, గ్రామస్తులు నాగజ్యోతి, భాను, చల్లకిలి తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్ల క్లీనింగ్ మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి-సత్యవేడు: మండల పరిధిలోని పలు పంచాయతీలకు ఐప్రెజర్ టాయిలెట్స్ క్లీనింగ్ మిషన్లను, ఇన్సులేటర్ స్మోక్ కంట్రోల్ యూనిట్లను స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, వైసీపీ జిల్లా కార్మిక శాఖ అధ్యక్షులు బిరేంద్ర వర్మ, మండల నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, బెల్ట్ రమేష్, ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ రమణ కుమార్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు శివయ్య, అయ్యప్ప, సత్యవేడు పంచాయతీ సెక్రెటరీ మునిరవికుమార్, సర్పంచులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలానికి కొత్తగా వచ్చిన తహశీల్దార్ టీవీ సుబ్రహ్మణ్యంను మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో మండలానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు, నాయకులకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన

ప్రజాశక్తి-కోట: మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ఐఎస్టిలో మంగళవారం సుప్రజా టెక్నాలజీస్ సీఈఓ సంతోష్ చలువాది 'ఉపాధి అవకాశాలపై అవగాహన' కల్పించారు. ఈ సదస్సులో మొదటి సంవత్సరం సీఎస్ఈ విద్యార్థులకు అందుబాటులోని అవకాశాలను తెలుసుకోవడం, వాటిని ఎలా సాధించాలో తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ వి.విజయ కుమార్ రెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి ఎ.రాజశేఖర్ రెడ్డి, ఐఈఈఈ ఎస్‌బి కౌన్సిలర్ ఎస్.సురేష్ బాబు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌ఛార్జ్ డి.ఎస్తేర్ రాణి పాల్గొన్నారు.

నేడు అద్వితీయ సంగీత గేయ ధార కార్యక్రమం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ వి బి సాయి కష్ణ యాచెంద్ర అద్వితీయ సంగీత గేయ ధార 405వ కార్యక్రమం ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు పట్టణంలోని ఏడీకే కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథిగా సినీ గేయ రచయిత భువన చంద్ర, కవి, కథకులు, విమర్శకులు డా. కానల నాగభూషణం, ప్రాశ్నికులు డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, ఆముదాల మురళి, శోభా రాజు, పాలూరి బ్రహ్మానందం రెడ్డి, రవిలు విచ్చేయనున్నట్లు తెలిపారు.

'తిరుమల పవిత్రతను వైసీపీ దిగజార్చుతోంది'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమలలో ఎలాంటి రాజకీయ ప్రచారాలు, రాజకీయ పార్టీలకు చెందిన జెండాలను తీసుకెళ్లడానికి అనుమతించని టిటిడి నేడు తిరుమల బాలాజీ నగర్ లో అధికార పార్టీ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు, బ్యాగులను ఎలా తీసుకెళ్లారని తిరుపతి మాజీ శాసనసభ్యులు సుగుణమ్మ ప్రశ్నించారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎంతో పవిత్ర పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన తిరుమలను రాజకీయ పార్టీ స్టిక్కర్లను అంటించి భక్తులు అసహనానికి గురయ్యాలా వ్యవహరిస్తున్నారన్నారు. మూడు అంచెల భద్రత, నిఘా ఉన్న తిరుమలకు వైసీపీ నాయకులు నిషేధమైన రాజకీయ పార్టీల స్టిక్కర్లు బ్యాగులను తీసుకెళ్లారంటే పూర్తిగా అధికారుల నిర్లక్ష్యమేనని సుగుణమ్మ అభిప్రాయపడ్డారు. టిడిపి కార్పొరేటర్ ఆర్సి మునికృష్ణ, బుల్లెట్ రమణ, మునిశేఖర్ రాయల్, కరాటే చంద్ర, ఊట్ల సురేంద్ర నాయుడు, మహేష్ యాదవ్, విశ్వనాథం, రాజారామ్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: తిరుమలను సీఎం జగన్ స్టిక్కర్లు అతికించి రాజకీయ క్షేత్రంగా మార్చేశారని చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగం రెడ్డి మంగళవారం పేర్కొన్నారు.

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్: పులివర్తి నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర భవిష్యత్తు ఉందని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. మంగళం పరిధిలోని మంగళం పంచాయతీలో గల బసవతారక రామాపురంలో 13వ రోజు మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల నీటికుంటలో పడి చనిపోయిన తిరుపతి రూరల్ మండల మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి కుటుంబాన్ని పరామర్శించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. 2024లో టిడిపి ఆవశ్యకత ఈ రాష్ట్రానికి ఎంత ఉందో ప్రజలకు తెలిపారు. ఇప్పుడు అప్రమత్తంగా ఉండకపోతే 20 ఏళ్ళు వెనక్కు వెలిపోతామన్నారు. ఓ పక్క దాడులు, దౌర్జన్యాలు, మరోపక్క ధరల బాదుడుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా స్మశాన వాటికలు లేని గ్రామాల పరిస్థితి వైసిపి పాలనకు అద్దం పడుతొందన్నారు. సప్తగిరికాలనిలో అంగవైకల్యంతో బాధపడుతున్న గణేష్ అనే బాలుడిని చూసి చలించిపోయిన నాని బాలుడికి వీల్ చైర్ వితరణగా అందించారు. అనంతరం శిల్ప కళాకారులతో పాలు పంచుకున్నారు. టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ఈశ్వరయ్య, భాస్కర్ రెడ్డి, ధర్మారెడ్డి, చలపతి, సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ ఇంజినీరింగ్ కాలేజీలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ సెక్రటరీ వినయ్ కుమార్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 50 ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీలు వచ్చాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ వి.రవి ప్రసాద్ మాట్లాడుతూ నిరుద్యోగ, గ్రామీణ అభ్యర్థులకు జాబ్ మేళా ఒక వరం అని పేర్కొన్నారు. ఈ నియామక ప్రక్రియకు అవసరమైన మౌలిక వసతులను ప్లేస్‌మెంట్ అధికారి హేమంత్, కళాశాల సిబ్బంది ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ జాబ్ మేళాలో 800 మంది పాల్గొనగా వారిలో 550 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన ఉద్యోగులకు కనిష్ఠ వార్షిక వేతనం రూ.2 లక్షల నుంచి గరిష్ఠ వార్షిక వేతనం రూ.8 లక్షల వరకు లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎవిఎస్ ప్రసాద్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌లో మెసేజ్ పంపండి...సమస్యలు పరిష్కరిస్తాం: ఆర్డీవో

ప్రజాశక్తి-గూడూరు: వినూత్న పద్ధతిలో ప్రజలకు సేవలందించాలనే సంకల్పంతో ప్రజలు కార్యాలయాలకు రాకుండానే వారి సమస్యలను ఆన్‌లైన్ వాట్సాప్ వేదికగా పరిష్కరించడానికి రెవెన్యూ డివిజనల్ అధికారి మీసాల కిరణ్ కుమార్ మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే సందర్శకుల సంఖ్యను తగ్గించే ప్రయత్నంలో సోషల్ మీడియాను వాడుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే అధికారులకు ఆర్డీఓ ఆదేశించారు. సోషల్‌మీడియా వేదికగా ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవ చేయాలని వాట్సప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. అందులో భాగంగానే వాట్సప్ నెంబర్లను రెవెన్యూ సమస్యలకు గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో, రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికి సబ్ కలెక్టర్ కార్యాలయంలో కేటాయించారు. అర్జీలు సమర్పించుటకు రాలేని పక్షంలో సెల్ నెం.9490947555 వాట్సప్ ద్వారా అర్జీని పంపించవచ్చని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'జగన్ పాలనలోనే యువతకు ఉన్నత భవిష్యత్'

ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే విద్యార్థులు, యువతకు ఉన్నత భవిష్యత్తు ఉందని వైఎస్సార్ విద్యార్థి విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షులు బి ఓబుళ రెడ్డి, రీజనల్ కో-ఆర్డినేటర్ లెక్కల రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎస్‌వి యూనివర్సిటీలోని పలు విభాగాల్లో విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వారు వివరించారు. వైఎస్సార్ విద్యార్థి నాయకులు మణి, ప్రశాంత్, ప్రదీప్, నర్సింహులు, దినేష్, భాషా, రామలింగ రెడ్డి, శ్రీనివాసులు, ప్రకాష్, ప్రేమ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెవిబి పురం: మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. కార్యక్రమంలో హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి నందకుమార్, వైస్ ఎంపీపీ సరస్వతి శీను యాదవ్, జడ్పిటిసి మూర్తి మునెమ్మ సుబ్బయ్య, సచివాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఊరందూరు ఎస్టి కాలనీ, ముద్దుముడి పంచాయతీలో స్థానిక వైసీపీ నాయకులు మంగళవారం గడపగడప కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఎంపీడీవో ప్రేమ్ రాజ్ కుమార్, ఈవోపీఆర్‌డీ సురేంద్రనాథ్, హౌసింగ్ ఏఈ అలీ, ఊరందూరు గ్రామ సచివాలయ డిడిఒ చక్రవర్తి, వైసీపీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా భాకరాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శశికళ ఆధ్వర్యంలో మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దామని మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మలేరియా వ్యాధి సాధారణంగా ఆడ ఏనాఫిలిస్ దోమకాటుతో వస్తుందన్నారు. జ్వరం, చలిగా ఉండడం, వాంతులు, వికారం, ఒంటి నొప్పులు మొదలగు వంటివి మలేరియా వ్యాధిలో కనిపించే కొన్ని లక్షణాలు. దోమతెరలు వాడడం, వీలైతే తలుపులు, కిటికీలకు దోమలు రాకుండా మెస్ ఏర్పాటు చేసుకోవడం, వంటి జాగ్రత్తలతో మలేరియా నుండి రక్షణ పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పుత్తూరు రూరల్ మండలం పరమేశ్వర్ మండలం ప్రాథమిక కేంద్ర డాక్టర్ కళ్యాణి ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి కె.రమేష్ బాబు, హెల్త్ సూపర్‌వైజర్ ఆర్ లలిత, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు యువత ఎదుగుదలకు అవరోధాలు

ప్రజాశక్తి -క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ 3 దత్తత గ్రామమైన తనపల్లి లో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేకసేవ శిబిరంలో భాగంగా మాదకద్రవ్య వ్యసనాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పాస్ స్వచ్ఛంద సేవ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మంజుల విచ్చేసి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ముఖ్యంగా యువత మద్యం, పొగాకు మరియు మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు.

అధినేత హామీతో జనంలోకి విజయ భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి-నాయుడుపేట: తిరుపతి జిల్లా నాయుడుపేట మాజీ ఎంసి ఛైర్మన్ విజయభాస్కర్ రెడ్డి మునిసిపల్ ఎన్నికల కారణంగా గత కొంతకాలంగా టిడిపికి దూరంగా ఉంటున్నారు. పార్టీలో నిలకడ లేని కొంతమంది రాజకీయంతో ఆయనను గతంలో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆయన గురించి పూర్తి వివరాలు తెలుసుకున్న అధిష్టానం ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేశారు. ఈ నేథ్యంలోనే నిన్న విజయబాస్కర్ రెడ్డి, సూళ్లూరుపేట వ్యాపారవేత్త గంగా ప్రసాద్‌తో కలిసి చంద్రబాబును ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. ఆయన మంగళవారం నాయుడుపేట కు చేరుకున్నారు. నాయుడుపేటలో టిడిపి కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు: పట్టణంలోని బనిగిసాహెబ్ పేటలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ఉదయం చిన్నారులకు నోటు పుస్తకాలు, వాటర్ బాటిల్స్, పెన్సిళ్లను మొహమ్మద్ ఫక్రుద్దీన్ ఛారిటబుల్ ట్రస్ట్ వారు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మగ్దూమ్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా అంగన్వాడీ టీచర్ కోరిక మేరకు చిన్నారులకు విద్యా సామాగ్రిని అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సలహాదారులు సామాజిక కార్యకర్త మొహమ్మద్ అన్వర్, సిపిడిఒ మెహబూబ్ బి, ఎండి అన్వర్, ఈద్గా యూత్ మస్తాని, కరిముల్లా, జ్యోతి కిరణ్, సూపర్‌వైజర్ ఆషా బేగం, టీచర్ మోతీ జాన్, గయాజ్, జంషీద్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని తెలుగు గంగ క్వార్టర్స్ ఆవరణలోని లైబ్రరీ దగ్గర శంకర నేత్రాలయ చెన్నై వైద్య బృందం ముని, రామలింగా రెడ్డి కంటి పరీక్షలు మంగళవారం చేశారు. ఈ శిబిరంలో 64 మందికి కంటి పరీక్షలు చేయగా 32 మంది కంటి ఆపరేషన్‌కు ఎంపిక అవ్వడం జరిగింది. వీరికి బస్సు ఏర్పాటు చేసి చెన్నైలోని శంకర నేత్రాలయకు తరలించారు. సంస్థ క్యాంప్ కోఆర్డినేటర్ వై గౌరీ, వాలంటరీ కాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లావాదేవీలు పారదర్శకంగా ఉండాలి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మహిళా సంఘాల ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉండాలని లోకోస్ యాప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.డి.జ్యోతి అన్నారు. మంగళవారం తిరుపతి జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలంలోని వైఎస్ఆర్ క్రాంతి పథం-స్త్రీ శక్తి భవనంలో 11 మండలాలకు చెందిన ఏపీఎం, సీసీ, వీఓఏలకు లోకోస్ యాప్‌పై గత సోమవారం నుంచి బుధవారం వరకు 3 రోజుల పాటు జరుగుతున్న శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి ఎ.డి.జ్యోతి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐబి డిపిఎం మాధవి, చేయూత డిపిఎం వనజాక్షి, ఏరియా కో-ఆర్డినేటర్ పి.డాంగే యాదవ్, ఎపియం మునెయ్య, 11 మండలాల ఎపిఎం, సిసి, ఎల్‌సిసిసి, వీఓఏ లు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-కోట: పట్టణంలో రోడ్డు విస్తరణ నేపథ్యంలో ఆక్రమణలను గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్, అధికారులు కలిసి జేసీబీ సహాయంతో మంగళవారం తొలగించారు. ఇదివరకే నిర్మించుకున్న భవనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్ అండ్ బి అధికారులకు ఎంతవరకు అవసరమో వాటిని తొలిగించారు. దీంతో పలువురు వ్యాపారస్తులు సంతోషం వ్యక్తం చేశారు. వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ మల్లిఖార్జున్ రావు, రెవెన్యూ సిబ్బంది, ఆర్ అండ్ బి డీఈ అరుణకుమారి, పోలీసు యంత్రాంగం, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వాటర్ మిషన్ వితరణ



ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని మెప్మా కార్యాలయంలో తాళ్లూరు శ్రీనివాసులు ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆ సంస్థ ఛైర్మన్ తాళ్లూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు మల్టిపుల్ వాటర్ మిషన్‌ను మంగళవారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసీపీ, సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ మాట్లాడుతూ మెప్మా కార్యాలయానికి వచ్చే పొదుపు మహిళలు ఎండాకాలం దాహంతో ఇబ్బంది పడుతున్నట్లు తన దష్టికి రావడంతో ఈ వాటర్ మిషన్‌ను తన ట్రస్ట్ ద్వారా అందించడం సంతోషంగా ఉందన్నారు. ట్రస్ట్ సభ్యులు సురేంద్ర బాబు, శివ కుమార్ రెడ్డి, బత్తిన వంశీ, పెంచల గౌడ్, కోటా కష్ణా, అనిల్, మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మే 2న టీడీపీ జాతీయ అధ్యక్షుడి రాక

ప్రజాశక్తి-వెంకటగిరి: మే 2వ తేదీన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వెంకటగిరికి వస్తున్నారని మంగళవారం ఎస్ఎల్ఆర్ కళ్యాణ మండపంలో జరిగిన విస్తృత సమావేశంలో వెంకటగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఈ 4 సంవత్సరాలలో జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో విసిగిపోయిన ప్రజలు రాష్ట్ర అభివృద్ధి పథంలో నడిపే దానికి తెలుగుదేశం పార్టీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ నరసింహ యాదవ్, మాజీ మంత్రి పరసా రత్నం, పార్లమెంటరీ అబ్జర్వర్ సత్తిబాబు, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా అటవీశాఖ నిఘా విభాగం ఆధ్వర్యంలో జాండ్ల వద్ద మంగళవారం తెల్లవారు జామున చేపట్టిన వాహన తనిఖీల్లో 16 ఎర్రచందనం దుంగలతో పాటు రెనాల్ట్ డస్టర్ కారును ద్విచక్ర వాహనాన్ని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు నిఘా విభాగం డివిజనల్ ఫారెస్ట్ అధికారి శివకుమార్ మంగళవారం తెలిపారు. ఎఫ్ఆర్ఓ లక్ష్మీపతి ఆధ్వర్యంలో ఫారెస్ట్ బీట్ అధికారులు రమణమూర్తి, కోదండన్, కిషోర్ కుమార్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది నాగులయ్య, మునస్వామి, భార్గవ్, వినీల్, ఢిల్లీబాబు జాండ్ల సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారన్నారు. అటుగా వస్తున్న ద్విచక్ర వాహన దారుడు వాహన తనిఖీ చూసి తన వాహనాన్ని వదిలి పారిపోయాడన్నారు. ఆ వెంటనే మరొక రెనాల్ట్ డస్టర్ కారు వాహన తనిఖీలు చూసి కారు విడిచిపెట్టి పారిపోయారన్నారు. కారును తనిఖీ చేయగా 16 ఎర్రచందనం దుంగలు ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసామన్నారు. పారిపోయిన వారికోసం ప్రత్యేక బందాలతో గాలింపు చర్యలు చేపడుతామన్నారు.

సీఆర్ రెడ్డికి నివాళి

ప్రజాశక్తి-గూడూరు: పట్టణంలోని సీఆర్ రెడ్డి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సి.రాధాకృష్ణా రెడ్డి(95) మంగళవారం మరణించడంతో పలువురు ప్రముఖులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శిస్తున్నారు. ఈక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త గంగాప్రసాద్, తానంకి నానాజీ డాక్టర్లు సీఆర్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరివెంట పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్యా, వటంబేడు శివకుమార్, ఇజ్రాయెల్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్: డివిజన్‌లో ప్రజా డాక్టర్‌గా పేరు పొందిన డాక్టర్ సి.ఆర్ రెడ్డి మృతి ప్రజలకు తీరనిలోటు అని ప్రముఖ సీనియర్ ఆడిటర్ కంటి రామ్మోహన్ రావు పేర్కొన్నారు. సి.ఆర్.రెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రామకృష్ణ శత జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నటరాజ రామకృష్ణ శత జయంతి ఉత్సవాల పోస్టర్‌ను మంగళవారం మంత్రి రోజా ఆవిష్కరించారు. ఈనెల 29న రామకృష్ణ శత జయంతి సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించినున్నట్లు తెలిపారు.

జగనన్న ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: జగనన్న ఇళ్ళ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అందుకు అవసరమైన ఇంటి నిర్మాణ కార్మికులను పెంచుకోవడం తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అన్నారు. ఎం.కొత్తపల్లి లే అవుట్‌లోని ఇంటి నిర్మాణాలను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం హరిత మాట్లాడుతూ నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో నిర్మాణాలను పూర్తి చేయాలని, అనుకున్న మేరకు మొదటి విడత గహప్రవేశాలకు ఇళ్ళను సిద్ధం చేయాలన్నారు. తిరుపతి అర్బన్ నివాసితులకు ఎం.కొత్తపల్లిలో కేటాయించిన 4685 ఇంటి స్థలాల్లో నిర్మాణాలు వివిధ దశల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, లబ్ధిదారుల సహకారంతో అనుకున్న మేర గహప్రవేశాలకు లబ్ధిదారులను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు కమిషనర్ కి వివరించారు. ఇప్పటికే 9 బోర్లు వున్నాయని మరో రెండు బోర్లు వేయించాలని అధికారులు కమిషనర్ కి తెలపగా, కమిషనర్ అంగీకరిస్తూ 2 బోర్లు వేయిస్తామన్నారు. హౌసింగ్ పిడి వెంకటేశ్వర రావు, మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మునిసిపల్ డీఈ సంజీవ్ కుమార్, హౌసింగ్ డీఈ మోహనరావు, అమ్నెటి సెక్రటరీలు పాల్గొన్నారు.

అట్టహాసంగా సురేంద్ర జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -గూడూరు: మహా జనసైన్యం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు శ్రీ చేవూరు సురేంద్ర జన్మదిన వేడుకలను గూడూరు టీడీపీ పార్టీ ఆఫీస్ లో ప్రముఖ పారిశ్రామికవేత్త వేత్త శ్రీ కొండేపాటి గంగ ప్రసాద్ ,మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాజీ మంత్రివర్యులు పరసారత్నం, వేనాటి సతీష్ రెడ్డి, కన్నబాబు,సత్య , శ్రీనివాసులు రెడ్డి గూడూరు అన్ని మండలాల నాయకులు సమక్షంలో పార్టీ జనరల్ బాడీ సమావేశంలో సురేంద్రకి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ప్రజా వైద్యశాల గూడూరులో రోగులకు పండ్లు, ఆహారం అందజేయడం జరిగినది. కార్యక్రమంలో మహాజన సైన్యం జాతీయ ఉపాధ్యక్షులు యల్లసిరి నాగార్జున, కార్యదర్శి కె.లక్ష్మణ్, మనోహర్, దయాకర్, హరి మరియు తదితరులు పాల్గొన్నారు.

లైట్లు లేక విద్యార్థుల అవస్థలు : టీఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీ యూనివర్సిటీలో లైట్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని విసికి టీఎన్ఎస్ఎఫ్ నేతలు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. గత కొన్ని నెలలుగా యూనివర్సిటీలో లైట్లు లేక లైబ్రరీ, ప్రకాశం భవనం వద్ద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్, తెలుగు యువత నాగేంద్ర మాట్లాడుతూ ఎగ్జామ్ సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందికి గురవుతున్నారు. లేడీస్ హాస్టల్ వెళ్లడానికి లైట్లు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నారు. టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, శ్రీరామ్, పాల్గొన్నారు.